త్రినేత్ర
సత్యం ధర్మం జ్ఞానం

Hyderabad
27 February, 2026
7:30 PM Edition

www.trinethra.news

360° Digital News




# ఇక E20 పెట్రోల్..

ఇకపై పెట్రోల్ బంకుల్లో 20 శాతం ఇథనాల్ కలిపిన E20 పెట్రోల్ సరఫరా కానుంది. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది. దీనివల్ల పర్యావరణానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలయ్యే అవకాశం ఉన్నప్పటికీ, పాత కార్ల ఇంజిన్లపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అన్ని పెట్రోల్ పంపుల్లో లభించే ఈ ఇంధనం 'రీసెర్చ్ ఆక్టేన్ నంబర్' 95 ప్రమాణాలను కలిగి ఉండాలని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో వాహనదారుల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- త్రినేత్ర.న్యూస్

- ఏప్రిల్ 1 నుంచి మారనున్న నాణ్యత
- పర్యావరణం, ఆర్థిక వ్యవస్థకు మేలు
- పాత కార్ల ఓనర్లకు పరేషాన్

3

- **రీసెర్చ్ ఆక్టేన్ నంబర్ 95 అంటే...**

ఇది ఇంధన నాణ్యతను, ఇంజిన్‌లో 'నాకింగ్' నిరోధించే సామర్థ్యాన్ని కొలిచే ఒక ప్రమాణం. సాధారణంగా పెట్రోల్ ఇంజన్ సిలిండర్‌లో ఇంధనం, గాలి మిశ్రమం స్పార్క్ ప్లగ్ ద్వారా మండినప్పుడు వాహనం కదులుతుంది. కానీ కొన్నిసార్లు ఇంధనం తక్కువ నాణ్యత కలిగి ఉంటే, స్పార్క్ ప్లగ్ మండకముందే కంప్రెషన్ వల్ల ఇంధనం దానంతట అదే మండుతుంది. దీనివల్ల ఇంజిన్ నుంచి అసాధారణ శబ్దాలు (నాకింగ్) వస్తాయి. RON సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే, ఆ ఇంధనం అంత సులభంగా నాకింగ్‌కు గురికాదు.

# నడిగడ్డ స్ఫూర్తితో నడుద్దాం

- ప్రజలు బీఆర్ఎస్‌నే విశ్వసిస్తున్నరు
- అలంపూర్ కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్



**త్రినేత్ర.న్యూస్:**
నడిగడ్డ స్ఫూర్తిని రాష్ట్రమంతటా వ్యాపింపజేయాలని, అలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలందించిన మద్దతు విశేషమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కౌన్సిలర్లను సన్మానించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్‌పైనే ఉందన్నారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు

తరువాయి 2లో

# కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసేందుకే

- నాపై కేసు పెట్టారు
- పార్టీ పొరపాట్ల వల్లే బీఆర్ఎస్ ఓటమి
- ఇప్పుడు కడిగిన ముత్యంలా బయటకొచ్చా
- పార్టీ ప్రకటనకు ముందే తీర్పు రావడం సంతోషకరం: కవిత



2

# స్టాక్ మార్కెట్లు.. ఢమాల్

- ఆవిరైన 5 లక్షల కోట్ల సంపద!



దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యూఎస్-ఇరాన్ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండా ముగియడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి బలహీనపడడం తదితర కారణాలతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి.

3



యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పదోరోజు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా అర్చకులు పూర్ణాహుతి, చక్ర తీర్థం నిర్వహించారు. లక్ష్మీ సమేత నరసింహుడిని ఆలయం నుంచి కొండపైన విష్ణు పుష్కరిణి వరకు ప్రత్యేక సేవపై ఊరేగించి పూజలు నిర్వహించారు.

# సినిమా రంగంపై సీడాన్స్ పిడుగు!




చైనాకు చెందిన టెక్‌దిగ్గజం బైట్‌డాన్స్ అభివృద్ధి చేసిన కొత్త ఆర్టిఫిషియల్‌ఇంటెలిజెన్స్(AI) వీడియో మోడల్‌ప్రపంచ సినిమా రంగాన్నే కుదిపేస్తోంది.

4

# కేజ్రీవాల్ అవినీతిపరుడు కాదు



ఢిల్లీ మద్యం కేసులో తనకు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో కేజ్రీవాల్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు.

3



## సీఎం రేవంత్‌తో దేవ్ జీ, రాజిరెడ్డి భేటీ

త్రినేత్ర.న్యూస్ :

ఇటీవలే లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టు అగ్ర నేతలు శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. భేటీ అయిన వారిలో తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, పోతుల కల్పన అలియాస్ సుజాత, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, నూనె నర్సింహా రెడ్డి అలియాస్ గంగన్న ఉన్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఏడీజీ ఇంటలీజెన్స్ విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీ సుమతి హాజరయ్యారు.



## సౌందర్ రాజన్ కన్నుమూత

త్రినేత్ర.న్యూస్ :

చిలుకూరు బాలాజీ ఆలయ వ్యవస్థాపకుడు సౌందర్ రాజన్(90) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శుక్రవారం కన్నుమూసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. చిలుకూరులోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిలుకూరు వాసులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆలయ ప్రధాన అర్చకులు సౌందర రాజన్ మరణించారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త..

- పెండింగ్ బకాయిలు రూ. 745 కోట్లు విడుదల

త్రినేత్ర.న్యూస్ :

తెలంగాణ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిలు రూ.745 కోట్లు విడుదల చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. విడతల వారీగా బకాయిలు విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు తాజాగా బకాయిలు విడుదలయ్యాయి. మరోవైపు గ్రామ పంచాయతీలకు సైతం రూ.389 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

# కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసేందుకే

- నాపై కేసు పెట్టారు
- పార్టీ పొరపాట్ల వల్లే బీఆర్ఎస్ ఓటమి
- దాన్ని నా మెడకు రుద్దాలని చూశారు
- ఇప్పుడు కడిగిన ముత్యంలా బయటకొచ్చా
- పార్టీ ప్రకటనకు ముందే తీర్పు రావడం సంతోషకరం: కవిత



త్రినేత్ర.న్యూస్:

కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకే లిక్కర్ కేసు డ్రామా ఆడారని, పార్టీ పొరపాట్ల వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే తనపై కేసు పెట్టారని, కడిగిన ముత్యంలా బయటకొస్తానని ఆనాడే చెప్పానని.. ఇప్పుడు నిజం నిరూపితమైందన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో వచ్చిన క్లీన్ చిట్‌పై శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో తన పాత్ర లేదని చెప్తున్నా కొందరు తనపై అనుచితంగా మాట్లాడారని, ఈ తీర్పే వారికి చెంపపెట్టని అన్నారు.

**కేటీఆర్ అన్న నిజం ఒప్పుకోవాలి..**

నాపై పెట్టిన కేసు వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నట్లు నా అన్న కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేయడం హాస్యాస్పదమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి నేను కారణం కాదని.. ఆ పార్టీ చేసిన పొరపాట్ల వల్లే ఓడిందన్నారు. ప్రజలకు ఇళ్లు ఇవ్వకపోవడం, ఉద్యాగాల నియామకాల్లో నిర్లక్ష్యం, అభ్యర్థులను మార్చకుండా వారికే టికెట్లు ఇవ్వడం, ముఖ్యంగా నాయకుల అహంకార ధోరణి వల్లే ఓడిపోయిందన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ నిజం ఒప్పుకోవాలన్నారు. నేను అడుగుతున్న వాటికి సమాధానం చెప్పే ధైర్యం లేకనే నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేయాలని చూడటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తాను చెప్పిందే నిజమని కోర్టు తీర్పుతో తేటతెల్లమైందని చెప్పారు. ఇవాళ కోర్టు తీర్పును కూడా అనుకూలంగా మార్చుకుని మాట్లాడడం సిగ్గుచేటని ఫైర్ అయ్యారు. కేటీఆర్ ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. వాస్తవాలు ఒప్పుకుని లోపాలను సరి చేసుకోవాలని చెప్పారు. కేవలం ఒక వ్యక్తి వల్ల ఓడిపోయేంత బలహీనంగా పార్టీ ఉందా? అని ప్రశ్నించారు.

**న్యాయ వ్యవస్థపై నమ్మకం..**

5 నెలల జైలు జీవితంలో కుటుంబంతో పాటు తాను ఎంతో క్షోభననుభవించానని ఆవేదన చెందారు. ఈ కష్ట సమయంలో నా తల్లిదండ్రులు, అత్తమామలు అండగా నిలిచారని భావోద్వేగం చెందారు. తీర్పు రాగానే అమ్మతో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు. అండగా నిలిచిన కార్యకర్తలు, అభిమానులను జీవితంలో మర్చిపోలేనని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నన్ను గెలిపించిందన్నారు. జైల్లో ఉన్న సమయంలో ఢిల్లీకి విమాన టికెట్లు పెట్టుకొని అభిమానులు రావడం మరిచిపోలేనన్నారు. ఇకనుంచి ప్రజల వెంటే ఉంటానన్నారు.

- **రాజకీయ శక్తిగా మారుతా**

మరో మూడు నెలల్లో కొత్త పార్టీ పెట్టబోతున్నానని, దీనికి ముందే కోర్టు తీర్పు రావడం సంతోషకరమన్నారు. సొంతంగా పార్టీ పెట్టాలంటే ధైర్యం ఉండాలని.. పిడికెడు మందితో రాష్ట్రంలో రాజకీయ శక్తిగా మారతానని ఉద్ఘాటించారు. ఆడబిడ్డను అవమానించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి తనకు ఎప్పుడూ మద్దతు రాలేదని, తనపై పెట్టిన కేసులపై మూడేళ్లుగా ఒంటరిగానే పోరాడుతున్నాని వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని.. మళ్లీ ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని పేర్కొన్నారు.

**సీబీఐ అప్పీల్..**

కేజ్రీవాల్, కవితకు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో రౌస్ అవెన్యూ కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన నేపథ్యంలో సీబీఐ అప్పీల్ కు వెళ్లింది. రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వచ్చే వారం ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# జీఐ ఉత్పత్తుల విస్తరణే లక్ష్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్

త్రినేత్ర.న్యూస్:

జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్, విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలోనే తొలిసారి "జీఐ ఆన్ వీల్స్" కార్యక్రమాన్ని ఎంజీబీఎస్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇది గవర్నర్ దూరదృష్టి ఫలితమని తెలిపారు. గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. గవర్నర్ ప్రసంగిస్తూ.. జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం గవర్నర్, మంత్రి , జిల్లా కలెక్టర్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు కలిసి జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.




**బస్సులపై హస్తకళలు..**

గవర్నర్ ఆలోచనలకు అనుగుణంగా పోచంపల్లి ఇక్కత్, వరంగల్ తివాచీలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి రాష్ట్రానికి చెందిన ఆరు జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. డిజైన్లను జేఎన్ఏఎఫ్ఏయూ విద్యార్థులు రూపొందించగా వారికి నగదు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నడిగడ్డ స్ఫూర్తితో నడుద్దాం

**మొదటిపేజీ తరువాయి..**

ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన చర్యలను ఆయన ఖండించారు.

**అవినీతి, అరాచకం జోడెడ్లుగా..**

కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని ఆయన విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల నరికివేత వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**లిక్కర్ కేసు వల్లే బీఆర్ఎస్ ఓటమి: కేటీఆర్**

ఢిల్లీ లిక్కర్ కథ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కారణమైందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇదే సమయంలో కవితకు న్యాయం జరిగిందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. మద్యం కుంభకోణం పేరుతో ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు. మా లీడర్లపై నమోదైన ప్రతి కేసు రాజకీయ కక్షలో భాగమే. నిజాలు బయటకు రానంత కాలం కాంగ్రెస్, బీజేపీ దుష్ప్రచారాలను చూస్తూనే ఉంటాం. ఏదేమైనా చివరకు న్యాయమే గెలుస్తుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రేవంతుద్దీన్, అక్బరుద్దీన్ తోడు దొంగలే

- జీహెచ్ఎంసీలో బీజేపీని ఓడించేందుకు యత్నం..
- హైదరాబాద్‌ను కబ్జా చేసేందుకు నాటకం..
- కేజ్రీవాల్, కవిత తప్పు చేయలేదని కాదు..
- బీజేపీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

త్రినేత్ర.న్యూస్ :

రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ఇద్దరూ తోడు దొంగలే అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, మజ్లిస్ కలిసి బీజేపీని ఓడించేందుకు కుట్ర చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కోరుట్ల నియోజకవర్గానికి చెందిన డాక్టర్ అనూప్ రావు బీజేపీలో పార్టీలో చేరిన సందర్భంగా రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు.



ప్రధాని మోదీ పని తీరుపై, పార్టీ సిద్ధాంతంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది. ఈ క్రమంలో అనేక రాష్ట్రాల్లో బీజేపీని గెలిపిస్తున్నారు. ఆ సరళి తెలంగాణలో కూడా మొదలైందని రామచందర్ రావు తెలిపారు.

రేవంతుద్దీన్, అక్బరుద్దీన్ మంచి దోస్తులు, వారిద్దరూ ఎల్లప్పుడూ కలిసే ఉంటారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా అక్బరుద్దీన్ ఎప్పుడూ కూడా మాట్లాడరు. హైదరాబాద్ నగరంలో మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్ కొమ్ముకాస్తుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బీజేపీని ఓడించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు కూడా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రయత్నిస్తున్నారు. యూపీ సీఎం యోగి, సీఎం రేవంత్ ఒక్కటే అని అక్బరుద్దీన్ వ్యాఖ్యానించడం సరికాదు. హైడ్రా పేరుతో, గాంధీ సరోవర్ పేరిట బీదల ఇండ్లు కూలగొడుతున్నారు. అక్బరుద్దీన్ స్కూల్, కాలేజీ కూలగొట్టారా..? దాని గురించి మాట్లాడరు. ఇద్దరు కూడా తోడు దొంగలే. హైదరాబాద్ ప్రజలను మాయ చేస్తున్నారు. వారిద్దరి దోస్తీ విడవదు. హైదరాబాద్‌ను కబ్జా చేసేందుకు నాటకమాడుతున్నారు అని రామచందర్ రావు నిప్పులు చెరిగారు.

ఇక సాంకేతిక అంశాలపై అరవింద్ కేజ్రీవాల్, కవిత డిశ్చార్జ్ అయితే వాళ్లు తప్పు చేయలేదని కాదు. చంకలు గుద్దుకోవాల్సిన అవసరం లేదు. సీబీఐ అప్పీల్‌కు వెళ్లొచ్చు. ఈ కేసులో కవిత నిర్దోషి అయితే.. సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు ఎందుకు కాలబెట్టారు. ముందుంది మొసళ్ల పండుగ అని రామచందర్ రావు విమర్శించారు.

# స్టాక్ మార్కెట్లు.. ధమాల్

## ఆవిరైన రూ.5లక్షల కోట్ల సంపద..!

**దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యూఎస్-ఇరాన్ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండా ముగియడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి బలహీనపడడం తదితర కారణాలతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. ఐటీ, మీడియా మినహా అన్నిరంగాల స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ గత సెషన్‌తో పోలిస్తే శుక్రవారం 82,220.48 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేదు. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు పతనమైంది. ఇంట్రాడేలో 81,159.15 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది.**

త్రినేత్ర.న్యూస్:



చివరకు 961.42 పాయింట్లు తగ్గి.. 81,287.19 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 317.90 పాయింట్లు తగ్గి 25,178.65 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా ఒక్కొక్కటి ఒకశాతం వరకు నష్టపోయాయి. శుక్రవారం ఒకే రోజు దాదాపు 5లక్షల కోట్ల మదుపరులు నష్టపోయారు. బీఎస్ఈలో లిస్టెడ్ సంస్థల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ గత సెషన్‌లో రూ.468.5 లక్షల కోట్ల నుంచి రూ.463 లక్షల కోట్లకు పడిపోయింది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భారతి ఎయిర్‌టెల్, ఎంఅండ్ఎం, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సన్ ఫార్మా నిఫ్టీలో నష్టాల్లో ముగియగా.. ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, అపోలో హాస్పిటల్స్ లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే ఆటో, బ్యాంక్, ఎఫ్ఎంసీజీ, మెటల్, రియాల్టీ, టెలికాం ఒకశాతం నుంచి 2శాతం వరకు తగ్గాయి. ఐటి, మీడియా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ లాభాల్లో ట్రేడయ్యాయి.

ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ 225, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్ తక్కువగా కోట్ అయ్యాయి. గురువారం యూఎస్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. చిప్‌మేకర్ ఎన్‌విడియా త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎస్ అండ్ పీ 500, యూరోపియన్ మార్కెట్లు నష్టపోయాయి. ఊహించిన దాని కంటే మెరుగైన ఫలితాలు ఉన్నప్పటికీ కంపెనీ షేర్లు 5.5శాతం పడిపోయాయి. అలాగే, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,465.99 కోట్ల విలువైన ఉపసంహరించుకున్నారు. దాంతో మార్కెట్లు బలహీనపడ్డాయి. ట్రెహ్రాన్ అణు కార్యక్రమాల విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య గురువారం చర్చలు జరిగాయి. ఎలాంటి ఒప్పందం లేకుండా ముగియడం మధ్యప్రాచ్యంలో ఆందోళనలు పెంచాయి. అమెరికా దాడులు చేస్తుందన్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనికి తోడు డాలర్‌తో పోలిస్తే రూపాయి 4 పైసలు తగ్గి 90.95కి చేరిందని ట్రేడ్ వర్గాలు తెలిపాయి.

# ఇక E20 పెట్రోల్..

- ఏప్రిల్ 1 నుంచి మారనున్న నాణ్యత
- పర్యావరణం, ఆర్థిక వ్యవస్థకు మేలు
- పాత కార్ల ఓనర్లకు పరేషాన్

**E20-కంపాటిబుల్ కార్లు (కొత్త వాహనాలు)**
2023 తర్వాత దేశంలో లాంచ్ అయిన అన్ని కొత్త కార్లు, ద్విచక్ర వాహనాలు E20 ఇంధనానికి అనుగుణంగా డిజైన్ చేయబడ్డాయి. స్వచ్ఛమైన పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌లో క్యాలరిఫిక్ విలువ (శక్తి) తక్కువగా ఉంటుంది. కాబట్టి కొత్త కార్లలో కూడా మైలేజ్ కొద్దిగా తగ్గొచ్చు.

**నాన్-E20 కార్లు (పాత వాహనాలు)**
2020కి ముందు వచ్చిన వాహనాలు E20 ఇంధనం కోసం డిజైన్ చేయలేదు. ఇథనాల్‌కు నీటిని పీల్చుకునే గుణం ఉంటుంది. ఇది పెట్రోల్ కంటే ఎక్కువ అరుగుదలకు కారణమవుతుంది. పాత కార్లలోని రబ్బర్ పైపులు, ప్లాస్టిక్ సీల్స్, గ్యాస్కెట్లు, కొన్ని లోహ భాగాలు ఇథనాల్ వల్ల త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. చలికాలంలో లేదా ఉదయం పూట ఇంజిన్ స్టార్ట్ చేయడానికి ఇబ్బంది పడాల్సి రావచ్చు. పెట్రోల్ ట్యాంక్ లోపల తుప్పు ఏర్పడే ప్రమాదమూ ఉంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**
కారు కంపెనీ ఇచ్చిన బుక్‌లెట్లో ఇథనాల్ ఎంత తట్టుకోగలదో స్పష్టంగా రాసి ఉంటుంది. బ్రాండ్ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించి మెకానిక్‌ల సలహా తీసుకోవాలి. పాత రబ్బర్ ఫ్యూయల్ లైన్స్, ఫిల్టర్లు, గ్యాస్కెట్లను రెగ్యులర్‌గా తనిఖీ చేయించుకోవాలి. ఇథనాల్ తట్టుకునే కొత్త పైపులను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం. కారును రోజుల తరబడి వాడకుంటే ట్యాంక్ నిండుగా ఉండేలా చూసుకోవాలి.

# ఆప్‌ను అంతం చేసే కుట్ర జరిగింది



త్రినేత్ర.న్యూస్:

**అధికారం కోసం ప్రభుత్వాలను కూల్చవద్దని.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కలిసి ఆప్‌ను అంతం చేయడానికి రాజకీయ కుట్ర పన్నారని ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితతో పాటు ఆయనకు క్లీన్‌చిట్ వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. తనపై కుట్రలు చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ తీర్పుతో నిజనిజాలు బయటపడ్డాయన్నారు.**

తనతో పాటు తమ పార్టీలోని ఐదుగురు కీలక నేతలను జైల్లో పెట్టారని ఆవేదన చెందారు. తాను అవినీతిపరుడిని కాదని.. ఇప్పుడు కోర్టు కూడా అదే చెప్పింది' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తనపై, తన పార్టీపై వచ్చిన అన్ని ఆరోపణలు నిరాధారమైనవని తేలిందన్నారు. ఈ కేసులో సీబీఐ ,ఈడీ ఛార్జ్ షీట్లు దాఖలు చేసినప్పటికీ, ప్రాసిక్యూట్ చేయడానికి తగిన ఆధారాలు ఉన్నాయా లేదా అనే దానిపై తుది నిర్ణయం కోర్టుదేనని స్పష్టం చేశారు. కేసును కొనసాగించడానికి కచ్చితమైన ఆధారాలు లేవని కోర్టు తేల్చిందని వివరించారు. భారత న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందన్నారు. కేజ్రీవాల్ ను భార్య సునీత ఆలింగనం చేసుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు.

# భారత్ ప్రోద్బలంతోనే దాడులు

- పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ అక్కసు

త్రినేత్ర.న్యూస్:

**భారత్ ప్రోద్బలంతోనే అఫ్గానిస్థాన్ తమపై దాడులు చేస్తుందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. పాక్-అఫ్గాన్ మధ్య భీకర దాడులు జరుగుతున్న సమయంలో భారత్ పై మరోసారి తన అక్కసును వెల్లగక్కారు. ఢిల్లీ, కాబూల్ కలిసి పాకిస్థాన్‌పై ప్రాక్సీ యుద్ధం చేస్తున్నాయని ఫ్రాన్స్ 24 ఇంటర్వ్యూలో చెప్పారు. తమపై అఫ్గన్లు దాడులు చేసేలా భారత్ ప్రేరేపించిందని ఆరోపించారు. అఫ్గన్ భారత్‌కు వలస రాజ్యంగా ఉందని, ఇప్పుడు తాము పరోక్ష యుద్ధాన్ని ఎదుర్కొంటున్నామన్నారు. భారత్-అఫ్గానిస్థాన్ సంబంధాలను అనుమానాస్పదంగా పేర్కొన్నారు.**





**ఆపరేషన్ గజబ్ లిల్..**
గురువారం రాత్రి అఫ్గాన్ దాడులకు బదులుగా పాక్ వైమానిక దాడులు ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్'గా పేర్కొంది. అఫ్గాన్ సైనికులు 133 మంది మరణించగా.. 200 మందికి పైగా గాయపడ్డారు. తొమ్మిది మంది సైనికులను నిర్బంధించినట్లు పాక్ తెలిపింది. మరోవైపు కాబుల్‌లో పేలుడు సంభవించినట్లు తాలిబన్ అధికారులు పేర్కొన్నారు. కాబుల్, కాందహార్, పక్తియా ప్రావిన్స్‌లలో వైమానిక దాడులు జరిగాయని అఫ్గాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీహుల్లా తెలిపారు. తాము చేసిన దాడుల్లో 55 మంది పాక్ సైనికులు చనిపోయారని పేర్కొన్నారు.



## డీఎంకే గూటికి సెల్వం

త్రినేత్ర.న్యూస్:

తమిళనాడు మాజీ సీఎం, అన్నాడీఎంకే బహిష్కృత నేత పన్నీర్ సెల్వం అధికార డీఎంకే పార్టీలో చేరారు. చెన్నైలో సీఎం స్టాలిన్ సమక్షంలో సెల్వం, ఆయన కుమారుడు, మాజీ ఎంపీ రవీంద్రనాథ్‌తో పాటు ఎమ్మెల్యే అయ్యప్పన్ తదితరులు శుక్రవారం డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. దివంగత మాజీ సీఎం జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా సెల్వంకు పేరుంది. జయలలిత మరణం తర్వాత ఎడప్పాడి పళనిస్వామి, పన్నీర్‌సెల్వం మధ్య ఆధిపత్య పోరుతో సెల్వంను పార్టీ నుంచి బహిష్కరించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన తేనిలోని బోడి మెట్టు నుంచి డీఎంకే తరఫు సెల్వం పోటీ చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



## ఒకే కాన్పులో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చిన మహిళ

త్రినేత్ర.న్యూస్:

చైనాలో వైద్య చరిత్రలోనే అరుదైన ఘటన చోటు చేసుకుంది. 24 ఏళ్ల మహిళ ఒకే కాన్పులో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చి రికార్డు సృష్టించింది. వాయువ్య చైనా లోని జిన్జియాంగ్ ఉయ్ఘర్ ప్రాంతానికి చెందిన 24 ఏళ్ల దిలీ.. వూహాన్ విశ్వవిద్యాలయానికి చెందిన జోంగ్నాన్ ఆసుపత్రిలో డెలివరీ అయ్యింది. ఒకే కాన్పులో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చింది. అందులో ఒకరు బాబు కాగా, నలుగురు ఆడపిల్లలు. పిల్లలు 870 గ్రాముల నుంచి 1,030 గ్రాముల మధ్య పుట్టినట్లు వైద్యులు తెలిపారు. ఇది అత్యంత అరుదైన ఘటనగా పేర్కొన్నారు. తల్లీ, బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.



## వణికిన కోల్‌కతా

త్రినేత్ర.న్యూస్:

భారీ భూకంపతో కోల్‌కతా వణికిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. బంగ్లాదేశ్‌లో వచ్చిన భూకంప తీవ్రత 5.4 ప్రభావంతో కోల్‌కతా, పరిసర ప్రాంతాల్లో భూమి కంపించింది. దీంతో కార్యాలయాలు, భవనాల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. ప్రాథమిక నివేదికల ప్రకారం.. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5గా నమోదైంది. నగరం నుంచి 8 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## స్టాక్ మార్కెట్స్

| | | |
|---|---|---|
| NIFTY | - | ▼ 25,178.65 |
| SENSEX | - | ▼ 81,287.19 |

**డాలర్ వర్సెస్ రూపాయి**

1 డాలర్ కు
91.05 రూపాయలు

**బులియన్ మార్కెట్**

- 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,61,570
- 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,48,100
- వెండి ధర (ఒక కిలో) - రూ.2,85,000





4 త్రినేత్ర
సత్యం ధర్మం జ్ఞానం
Digital News 360°
www.trinethra.news
Hyderabad
27 February, 2026



# సినిమా రంగంపై సీడాన్స్ పిడుగు!

చైనాకు చెందిన టెక్‌దిగ్గజం బైట్‌డాన్స్అభివృద్ధి చేసిన కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AI) వీడియో మోడల్ ప్రపంచ సినిమా రంగాన్నే కుదిపేస్తోంది. ఈ ఏఐ టూల్‌ను ఉపయోగించి రూపొందించిన వీడియోలు ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ఒక్క ప్రాంప్ట్‌తో కళ్లు చెదిరేలా విజువల్స్ తయారు చేస్తున్నది. దీంతో సాంకేతిక రంగంతో పాటు సృజనాత్మక రంగాల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. టిక్‌టాక్ మాతృ సంస్థ తీసుకువచ్చిన సీడాన్స్2.0 (Seedance 2.0) ప్రధాన కారణంగా నిలిచింది. ఈ టూల్‌తో ప్రాంప్ట్‌లు ఇస్తే హాలీవుడ్ రేంజ్‌లో సినిమా విజువల్స్‌ను తయారు చేసే సత్తా దీనికి ఉంది. అద్భుతమైన విజువల్స్‌తో పాటు సౌండ్ డిజైన్‌ను సమన్వయం చేయగలగడం దీని ప్రత్యేకత.

- హై క్వాలిటీతో వీడియోలు
- ఒక్క ప్రాంప్ట్‌తో కళ్లు చెదిరే విజువల్స్ తయారీ
- బైట్‌డాన్స్ ఏఐ టూల్‌తో కలవరం
- ఇండస్ట్రీపై భారీ ప్రభావం పడే ఛాన్స్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సినీ ప్రముఖులు..





త్రినేత్ర.న్యూస్:

సీడాన్స్‌తో రూపొందించినట్లుగా స్పైడర్మ్యాన్, డెడ్‌పూల్ వంటి పాత్రలకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో హాలీవుడ్ దిగ్గజ సంస్థలైన డిస్నీ ,పారామౌంట్ పిక్చర్స్ స్పందించాయి. కాపీరైట్ ఆరోపణలు చేస్తూ బైట్‌డాన్స్‌కు సీజ్ అండ్ డిసిస్ట్ పేరిట నోటీసులు జారీ చేశాయి. జపాన్‌లోనూ ప్రముఖ యానిమేటెడ్ పాత్రలతో రూపొందించిన ఏఐ వీడియోలపై ఇప్పటికే విచారణ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అయితే, బైట్‌డాన్స్ మాత్రం ప్రస్తుతం అమలులో ఉన్న రక్షణ చర్యలను మరింత బలోపేతం చేస్తున్నామని వెల్లడించింది.

**సీడాన్స్ అంటే ఏమిటి?**
సీడాన్స్ తొలి వెర్షన్ గతేడాది జూన్‌లో విడుదలైంది. కానీ పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. తాజాగా వచ్చిన సీడాన్స్2.0 వెర్షన్ మాత్రం ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. క్రియేటివ్ స్టూడియో వీడియో స్టేట్‌కు చెందిన జాన్ విల్లెమ్ బ్లామ్ మాట్లాడుతూ 'ఇప్పటి వరకు చూసిన ఏఐ వీడియోలు బాగానే ఉన్నాయి. కానీ, ఇది నేరుగా అసలు సినిమా నిర్మాణంలో ఉన్నట్లుగానే హైక్వాలిటీతో ఉన్నాయి' అని తెలిపారు. ఇప్పటి వరకు పలు మోడల్స్ యూజర్లు ఇచ్చే సూచనల మేరకు ఫొటోలను తయారు చేసి ఇస్తున్నాయి. అయితే, సీడాన్స్ టెక్స్ట్‌తో పాటు విజువల్స్, ఆడియోను ఒకే వేదికపై సమగ్రంగా సమన్వయం చేయడం విశేషమని నిపుణులు చెబుతున్నారు.

## ఒక్క ప్రాంప్ట్‌తోనే..
**మిడ్‌జర్నీ, సోరా వంటి టూల్స్ సరసన నిలిచే స్థాయిలో ఈ టూల్ ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ఒకే ప్రాంప్ట్‌తో అత్యుత్తమ నాణ్యత కలిగిన వీడియోలు తయారు చేస్తోంది. సీడాన్స్‌లో రూపొందించబడినట్లు చెబుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నటుడు విల్‌స్మిత్ స్పాగెట్టి (ఇటాలియన్ వంటకం) తింటున్న వీడియోలతో పాటు పలు భారీ బడ్జెట్ యాక్షన్ సీన్స్ తరహాలో వీడియోలు సైతం వైరలయ్యాయి. సింగపూర్‌కు చెందిన యానిమేషన్ స్టూడియో 'టైనీ ఐలాండ్ ప్రొడక్షన్స్' అధినేత డేవిడ్ క్వాక్ మాట్లాడుతూ 'ఇది యాక్షన్ సీన్స్ వాస్తవంగా తెరకెక్కించినట్లుగా ఉన్నాయని, యాక్షన్ సినిమాల్లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన సినిమాటోగ్రాఫర్ తోడుగా ఉన్నట్టే అనిపిస్తోందని' వ్యాఖ్యానించారు.**





**చిన్న సంస్థలకు కొత్త దారులు..**
అయితే, చిన్న నిర్మాణ సంస్థలకు సీడాన్స్ వంటి టూల్స్ కొత్త ద్వారాలను తెరుస్తాయని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. తక్కువ బడ్జెట్‌తో రూపొందించే షార్ట్ వీడియోలు, మైక్రో డ్రామాలు సాధారణంగా ప్రేమకథలు, కుటుంబ కథలకే పరిమితమవుతుంటాయి. ఇందుకు ప్రధాన కారణంగా విజువల్ ఎఫెక్ట్స్ ఖర్చులు అధికంగా ఉండడం. తాజాగా ఏఐ సహాయంతో సైన్స్‌ఫిక్షన్, పీరియడ్ డ్రామా, యాక్షన్ వంటి విభిన్న జానర్లలోనూ ప్రయోగాలు చేయొచ్చని డేవిడ్‌క్వాక్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఎన్నో సవాళ్లు..
**సీడాన్స్ కాపీరైట్ వివాదాల్లో చిక్కుకుంది. అనుమతి లేకుండా కాపీరైట్ పాత్రలను వినియోగించడంతో క్రియేటివ్ రంగాల్లో ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హాలీవుడ్ స్టూడియోలు దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. తమ మేధో సంపత్తిని అనధికారికంగా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నాయి. సాంకేతిక పురోగతికి నైతిక బాధ్యత సైతం జోడించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేదంటే భవిష్యత్తులో సృజనాత్మక రంగాలు, టెక్నాలజీ సంస్థల మధ్య వివాదాలు మరింత ముదిరే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఇదే తరహా ఆరోపణలు గతంలో ఇతర ఏఐ సంస్థలపైనా వచ్చాయి. 2023లో ది న్యూయార్క్ టైమ్స్ తన వ్యాసాలను అనుమతి లేకుండా వాడుకున్నారని ఓపెన్ ఏఐ, మైక్రోసాఫ్ట్‌పై కేసు వేసింది. గతేడాది రెడ్డిట్ సైతం ఇలాంటి కారణాలతో న్యాయ పోరాటం ప్రారంభించింది. గూగుల్‌పై డిస్నీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది.**

## మరణ శాసనమన్న రామ్‌గోపాల్‌వర్మ
**ఈ ఏఐ టూల్‌పై టాలీవుడ్ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ సైతం ఆందోళన వ్యక్తం చేశారు. సీడాన్స్ 2.0 ఏఐ టూల్స్ కారణంగా సినిమా ఎకోసిస్టమ్ పూర్తిగా మారిపోతుందన్నారు. వందల కోట్ల బడ్జెట్లు, వేలమంది టెక్నీషియన్లతో నడిచే ప్రస్తుత చిత్ర పరిశ్రమ ఇక చరిత్రగా మిగిలిపోవచ్చని వ్యాఖ్యానించారు. భారీ బడ్జెట్‌చిత్రాలు తెరకెక్కిస్తూ రాజమౌళి నెంబర్‌వన్ దర్శకుడిగా ఉన్నారని, ఆయనకున్న అసమానమైన సృజనాత్మక ఊహాశక్తితో వేల కోట్ల రూపాయలు రాబట్టడం సాధ్యమవుతోందన్నారు. 120 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత్‌లో ఎంతో మంది ఊహాశక్తి గలవారు ఉన్నప్పటికీ పరిశ్రమలోకి వచ్చే అవకాశం గానీ, పెట్టుబడి పెట్టే స్తోమత గానీ లేదన్నారు. అలాంటి వారికి సీడాన్స్ ద్వారాలు తెరిచిందన్నారు. ఇకపై భారీ బడ్జెట్లు, దీర్ఘకాలిక షూటింగులు అవసరం లేకుండానే థియేట్రికల్ క్వాలిటీ సినిమాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. నటీనటుల డేట్స్, మూడ్స్‌తో సంబంధం లేకుండా కేవలం వివరణాత్మక ప్రాంప్ట్‌ఇస్తే సినిమా విజువల్స్, సౌండ్ డిజైన్‌తో కూడిన సన్నివేశాలు నిమిషాల్లోనే సిద్ధమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు.**




**అంత్రోపిక్‌తో ఐటీరంగం కుదేలు..**
అంత్రోపిక్‌వంటి ఏఐ సంస్థల అభివృద్ధితో ఐటీ రంగం ఇప్పటికే తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అధునాతన ఏఐ మోడళ్ల రాకతో సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవల అవసరం తగ్గుతుందన్న ఆందోళనల నేపథ్యంలో టెక్ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా నష్టపోతున్నాయి. ఆటోమేషన్ పెరుగుదలతో ఉద్యోగాల భద్రత, ఖర్చుల పునర్వ్యవస్థీకరణ, పెట్టుబడుల మార్పు తదితర అంశాలు ఐటీ పరిశ్రమను ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పుడు అదే తరహాలో సీడాన్స్2.0 వంటి వీడియో జనరేటివ్ ఏఐ టూల్స్ సినిమా పరిశ్రమపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం డిస్క్రిప్టివ్ ప్రాంప్ట్‌లతోనే విజువల్స్, సౌండ్‌తో కూడిన సన్నివేశాలను సృష్టించే ఏఐ టెక్నాలజీ కారణంగా ఇండస్ట్రీపై ఆధారపడ్డ ఎంతో మంది రోడ్డున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, సినిమాల్లో నటీనటులు, ఇతర పాత్ర కీలకంగానే ఉంటుందని.. అయితే, నిర్మాణ పద్ధతులు, బడ్జెట్, టెక్నాలజీ వినియోగంలో భారీ మార్పులు ఉండే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## హాయ్..
## రష్మిక దేవరకొండ

**విజయ్, రష్మిక పెళ్లి తర్వాత తొలిసారి అభిమానుల ముందుకొచ్చారు. శుక్రవారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో అభిమానులకు అభివాదం చేశారు. ఫ్లయింగ్ కిస్సులిచ్చారు. రష్మిక దేవరకొండ అంటూ ఫ్యాన్స్ నినాదాలు చేశారు. దీంతో రష్మిక ఒకింత సిగ్గు ఒలకబోసింది. విజయ్ కూడా చిరునవ్వులు చిందించాడు. కాగా మార్చి 4న హైదరాబాద్‌లో జరగే వీరి రిసెప్షన్‌కు రాజకీయ, సినీ ప్రముఖులు అటెండ్ కానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.**



## కేరళ స్టోరీ 2 రిలీజ్‌కు లైన్ క్లియర్

# స్టే ఎత్తేసిన కోర్టు

**కేరళ స్టోరీ 2 రిలీజ్ వివాదం సినిమాకు మించిన ట్విస్ట్‌లతో సాగుతుంది. కేరళ స్టోరీ 2ను రిలీజ్ చేయడానికి వీలులేదంటూ కేరళ హైకోర్టులోని సింగిల్ బెంచ్ గురువారం స్టే విధించింది. తాజాగా శుక్రవారం సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ కొట్టివేసింది. ఈ సినిమాపై ఉన్న స్టేను ఎత్తివేసింది. డివిజన్ బెంచ్ తీర్పుతో కేరళ స్టోరీ 2 రిలీజ్‌కు సంబంధించిన అడ్డంకులు తొలగిపోయాయి.**




**సెన్సార్ సర్టిఫికేట్...**
కేరళ స్టోరీ 2 సినిమాలో కేరళ రాష్ట్రాన్ని తప్పుగా చిత్రీకరిస్తున్నారంటూ, ఈ సినిమాను విడుదల చేయడానికి వీలులేదంటూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్ సినిమాకు సెన్సార్ సర్టిఫికేట్ జారీ చేయడంలో సీబీఎఫ్‌సీ నియమనిబంధనలు సరిగా పాటించలేదంటూ ఫైర్ అయ్యింది. కేరళ స్టోరీకి సంబంధించి వస్తోన్న అభియోగాలను దృష్టిలో పెట్టుకొని సెన్సార్ విషయంలో పునఃపరిశీలించాలని సింగిల్ బెంచ్ ఆదేశించింది. సీబీఎఫ్‌సీతో పాటు నిర్మాతలకు నోటీసులు జారీ చేసింది. సినిమా రిలీజ్‌పై సింగిల్ బెంచ్ స్టేను విధించడంతో ఫిబ్రవరి 27న రిలీజ్ కావాల్సిన ఈ మూవీ వాయిదాపడింది.

**లైన్ క్లియర్...**
సింగిల్ బెంచ్ తీర్పుపై నిర్మాతలు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. నిర్మాతల పిటిషన్‌పై విచారించిన డివిజన్ బెంచ్ ప్రజల్లో ఉన్న అంచనాలు, అపోహల ఆధారంగా సినిమా రిలీజ్‌ను అడ్డుకోవడం కరెక్ట్ కాదని అన్నది. సీబీఎఫ్‌సీ ఇప్పటికే కేరళ స్టోరీ 2ను చూసి ఎలాంటి అభ్యంతరాలు లేవని చెబుతూ సర్టిఫికేట్ జారీ చేసిందని డివిజన్ బెంచ్ గుర్తుచేసింది. వివాదాస్పద అంశాలతో కూడిన ఈ సినిమాను రిలీజ్ చేస్తే గొడవలు జరిగే అవకాశం ఉందంటూ పిటిషన్ వాదనతో డివిజన్ బెంచ్ ఏకీభవించలేదు. శాంతి భద్రతల బాధ్యత ప్రభుత్వానికి సంబంధించినదని, వాటికి సినిమా రిలీజ్‌ను ముడిపెట్టవద్దని డివిజన్ బెంచ్ అన్నది. కోర్టు తీర్పుపై దర్శకనిర్మాతలు ఆనందం వ్యక్తం చేశారు. నిజాలను నిర్భయంగా చెప్పాలనే ప్రయత్నంతోనే తాము చేసిన సినిమా ఇదని పేర్కొన్నారు.

**ముగ్గురు హీరోయిన్లు...**
ది కేరళ స్టోరీ 2 మూవీకి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించాడు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించాడు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించారు. ఫిబ్రవరి 27న ఈ సినిమా రిలీజ్ కావాల్సింది. కోర్టు స్టే కారణంగా వాయిదాపడింది. 2023లో వచ్చిన కేరళ స్టోరీ మూవీకి సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కింది.

# దళపతి విజయ్‌కి షాక్

- **విడాకుల కోసం కోర్టును ఆశ్రయించిన భార్య**

**తమిళ అగ్ర కథానాయకుడు, టీవీకే అధినేత దళపతి విజయ్ తన భార్య సంగీత నుంచి విడిపోతున్నట్లుగా గత కొన్నాళ్లుగా పుకార్లు వినిపిస్తున్నాయి. ఈ రూమర్లపై ఇప్పటివరకు విజయ్‌తో పాటు ఆయన భార్య సంగీత మాత్రం రియాక్ట్ కాలేదు. తాజాగా మరోసారి విజయ్, సంగీతల విడాకుల వ్యవహారం కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.**



**విడాకులు కోరుతూ కోర్టుకు...**
విజయ్ నుంచి విడాకులు కోరుతూ సంగీత కోర్టు మెట్లు ఎక్కినట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. విజయ్ నుంచి విడాకులు కోరుతూ చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. ఏప్రిల్ 20న సంగీతతో పాటు విజయ్‌ని విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశించినట్లు సమాచారం.

**నటితో వివాహేతర సంబంధం...**
ఓ నటితో విజయ్‌కి వివాహేతర సంబంధం ఉందని తన పిటిషన్‌లో సంగీత ఆరోపించినట్లు సమాచారం. ఆమెతో ఉన్న బంధాన్ని తెంచుకుంటానని విజయ్ తనకు హామీ ఇచ్చాడని, ఇప్పటికీ ఆ నటితో విజయ్ రిలేషన్‌ను కొనసాగిస్తూనే ఉన్నాడని, అందుకే భర్త నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఫ్యామిలీ కోర్టులో సంగీత చెప్పిందని అంటున్నారు. ఈ రూమర్లపై విజయ్ స్పందిస్తాడా లేదా అన్నది అభిమానుల్లో ఆసక్తికరంగా మారింది.

**ఐదు సినిమాలు...**
విజయ్, సంగీత మధ్య మనస్పర్ధలకు కోలీవుడ్ స్టార్ హీరోయిన్ కారణమంటూ చెబుతున్నారు. ఆమెతో కలిసి విజయ్ ఇప్పటివరకు ఐదు సినిమాలు చేశాడు. మూడేళ్ల క్రితం వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా కూడా వచ్చింది. ఇటీవలే విజయ్‌తో ఆ హీరోయిన్‌కు ఉన్న రిలేషన్‌పై తమిళనాడు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ కూడా సంచలన కామెంట్స్ చేశాడు. ఆయన వ్యాఖ్యలు తమిళనాట పెద్ద దుమారాన్నే రేపాయి. విజయ్ సంగీత 1999 ఆగస్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. వీరికి కొడుకు జేసన్ సంజయ్‌తో పాటు కూతురు దివ్య సాషా ఉన్నారు. తండ్రి బాటలోనే తనయుడు జేసన్ సంజయ్ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ప్రస్తుతం దర్శకుడిగా సిగ్మా పేరుతో ఓ మూవీని తెరకెక్కిస్తోన్నాడు.

# అదే అసలైన విజయం..

వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తోంది తాప్సీ. ఇటీవల నెలకొన్న వివాదం సద్దుమణగకముందే మరోసారి స్టార్ హీరోయిన్లతో పాటు అగ్ర దర్శకులపై విమర్శలు చేసింది. హీరోలు, హీరోయిన్లకు సొంత గుర్తింపు ఉండాలని చెప్పింది. "ఓ సినిమా చేసే ముందు అందులో స్టార్ హీరోలు ఉన్నారా? టాప్ డైరెక్టర్ సినిమానా అనే లెక్కలు వేసుకోను. హయ్యెస్ట్ రెమ్యూనరేషన్లు తీసుకోవడం, టాప్ ప్లేస్‌లో ఉండటం కాదు. హీరోయిన్లకు ఓ ప్రత్యేకమైన ఇమేజ్ ఉండటమే నా దృష్టిలో అసలైన విజయం. ప్రేక్షకుల గుండెల్లో ఉన్నందుకు హ్యాపీగా ఉన్నాను. ఓ పాత్ర అనుకోగానే ఫలానా వారే బాగుంటారని దర్శకులు ఫిక్సవుతారు. . అని చెప్పుకొచ్చింది. ఈ కామెంట్లు ఏ హీరోయిన్‌ను ఉద్దేశించి తాప్సీ అన్నదో ఆసక్తికరంగా మారింది.



# రింకూ సింగ్ తండ్రి కన్నుమూత



భారత క్రికెటర్ రింకూ సింగ్ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన తండ్రి ఖాన్‌చంద్ సింగ్ స్టేజ్ 4 లివర్ క్యాన్సర్‌తో ఐసీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ హాస్పిటల్‌లో ఖాన్‌చంద్ సింగ్ తుది శ్వాస విడిచారు. గత కొంత కాలంగా ఖాన్‌చంద్ సింగ్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. హాస్పిటల్‌లో అత్యవసర చికిత్స విభాగంలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు వెంటిలేటర్ పై చికిత్స అందిస్తూ వచ్చారు. రెనాల్ రీప్లేస్‌మెంట్ థెరపీ (సీఆర్టీ)ని నిర్వహించినా ఫలితం లేకపోవడంతో చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

**రింకు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి..**
టీ20 వరల్డ్ కప్ లో ఆడుతున్న రింకూ సింగ్ సౌతాఫ్రికాతో జరిగిన సూపర్ 8 మ్యాచ్ అనంతరం తన తండ్రికి సీరియస్ ఉండడంతో ఇంటికి వెళ్లాడు. ఆయన పరిస్థితిని సమీక్షించాక తిరిగి జట్టుతో రింకు చేరాడు. గురువారం చెన్నైలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో రింకు ఆడలేదు. కానీ డ్రింక్స్ అందిస్తూ మైదానంలో కనిపించాడు. అయితే తండ్రి పరిస్థితి విషమించిందని తెలియడంతో అతను మళ్లీ గ్రేటర్ నోయిడాకు వెళ్లాడు. కాగా రింకు తండ్రి మరణవార్తపై బీసీసీఐ, తోటి ప్లేయర్లు, మాజీలు విచారం వ్యక్తం చేశారు. రింకు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎక్స్ వేదికగా స్పందించిన మాజీ ప్లేయర్ హర్భజన్ సింగ్ ఇది అత్యంత క్లిష్ట సమయమని, రింకు తండ్రి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.